క్లుప్తంగా

రామ స్థూప నిర్మాణానికి విరాళం

అద్దంకి: రమ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శింగరకొండలో రామ స్థూపం నిర్మిస్తున్నారు. రామ నామ స్థూపానికి రోటరీ రెటేరియన్ చుండూరి మురళీ సుధాకర్ రూ.25 వేల విరాళం ఫౌండేషన్ ప్రతినిధికి సోమవారం అందజేశారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, రొటేరియన్లు పాల్గొన్నారు.

విజన్ కార్యాచరణ ప్రణాళిక కార్యాలయం ప్రారంభం

అద్దంకి: నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికా కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. విజన్ 2047లో భాగంగా అద్దంకి యూనిట్ కార్యాలయాన్ని వర్చువల్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శింగయ్య, ప్రత్యేకాధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



అడవిలో వదులుతున్న కొండచిలువ

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్ ఆవరణలో ఆదివారం రాత్రి ఓ కొండచిలువ హల్‌చల్ చేసింది. కొండచిలువను చూసిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న వారు దాన్ని పట్టుకొని బంధించారు. పట్టుకున్న కొండచిలువ సుమారు 11 అడుగులు ఉంటుంది. అనంతరం అడవిలోకి తీసుకెళ్లి వదలినట్లు ఫారెస్టు అధికారి రమేష్ బాబు తెలిపారు.

కొర్రపాటి మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటు



కొర్రపాటికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

రంగప్పనాయుడువారిపాలెం (కారంచేడు): మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రంగప్పనాయుడువారిపాలెం సర్పంచ్ కొర్రపాటి అనీల్ తండ్రి కొర్రపాటి శివరాంప్రసాద్ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటుగా ఉందని ఆ పార్టీ మండల కన్వీనర్ జువ్వా శివరాంప్రసాద్ అన్నారు. పార్టీ బలోపేతానికి, గ్రామంలో పార్టీ కేటర్ ఒక తాటిపై ఉంచడానికి ఆయన ఎంతో కృషి చేసారని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సభలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కొర్రపాటి అనీల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పలపాటి అనీల్‌చౌదరి, పర్చూరు నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకుడు చిన్న నాయక్, మార్టూరు మండల ఎస్సీ సెల్ నాయకుడు తమ్మలూరి సురేష్, ఏజీఎస్ సొసైటీ అధ్యక్షులు మైనా చిననాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

చీరాల టౌన్: చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు సమర్థంగా పనిచేసి స్వర్ణాంధ్ర-2047 లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సూచించారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047లో భాగంగా విజన్ యాక్షన్ ప్లాన్‌ను వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్ మండలం, వేటపాలెం మండలాల్లోని గ్రామాల అభివృద్ధికి అధికారులు సమర్థంగా పనిచేయాలన్నారు.

ఘనంగా జంపని రేణుకాంబ తల్లి వార్షికోత్సవం

యద్దనపూడి: చింతపల్లిపాడులో కొలువై ఉన్న జంపని వారి కులదేవర జంపని రేణుకాంబ తల్లి వార్షికోత్సవం దేవర భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతపల్లిపాడు చిన్నయ్య, నారాయణ వెంకట సందీప్ దీక్షిత్ ఆధ్వర్యంలో మూలమూర్తి పూజలు విశ్వక్సేన, పుణ్యాహ మండప ఆరాధనలు రేణుకాంబ తల్లి మూలమూర్తి మహా శాంతి యాగం దంపతులచే నిర్వహించారు. భక్తులందరికీ ఆశీర్వచనలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా నివసిస్తున్న జంపని కుటుంబీకులు, జంపని వారి ఆడపడుచులు, అమ్మవారి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ చీరలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

నేడు శిడి మహోత్సవం

వేటపాలెం: రామన్నపేట పేట శివారు పంట పొలాల్లో వేంచేసి ఉన్న కనక నాగ వరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవం మంగళవారం సాయంత్రం జరగనుందని ఆలయ ఈఓ పోతిన శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. శిడి మహోత్సవానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



కలెక్టర్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న హేమ స్రవంతి



ప్రతిభ అవార్డులు అందుకున్న విద్యార్థినులతో తల్లిదండ్రులు



చీరాల: అవార్డులందుకుంటున్న విద్యార్థినులు



చినగంజాం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

బల్లికురవ: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఇచ్చినట్లు ఎంఈవోలు వస్తం నాయక్, కె.రమేశ్‌బాబు అన్నారు. సోమవారం బాపట్ల జిల్లాలో కలెక్టర్ జె.వెంకట మురళి, ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, పి. నరేంద్రవర్మ, చేతులమీదుగా మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాల నుంచి కంభాలనాగసాయి చరణతేజ, మాదాల హేమ స్రవంతి, కొమ్మినేనివారిపాలెం నుంచి షేక్ సుహానా, బల్లికురవ నుంచి దాసరి రమ్యశ్రీ, కూకట్లపల్లి నుంచి పోట్లూరి స్వప్న, వైదన నుంచి గుర్రాల వైష్ణవి, ఆరవై వేల నగుదు, ప్రశంస పత్రం అందుకున్నారు. వీరిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివారావు, బి. రామారావు, కె.హనుమంతరావు, జాన్, మారుతి, ఉపాధ్యాయులు, పీఎంసీ గ్రామ పెద్దలు అభినందించారు.

వేటపాలెం: పందిళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన సజ్జా దివ్యశ్రీ, పాగడ దండ శ్రావణి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడంతో విద్యాశాఖ ద్వారా అందిస్తున్న షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులు రూ.20 వేల నగదు అందుకున్నారు. సోమవారం బాపట్ల సాయిరాం కన్వెన్షన్ హాల్లో జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు విద్యాశాఖ ద్వారా షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు తోపాటు మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో చదువుతున్న బి.అనూష, షేక్ కరిష్మాలు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. సోమవారం బాపట్లలో జరిగిన కార్యక్రమంలో కాలేజీకి చెందిన సీనియర్ ఇంటర్ సీఎస్ఈకు చెందిన విద్యార్థినులు బి.అనూష, షేక్ కరిష్మాలు ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు కలెక్టర్, చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు ఎంఎం కొండయ్య, వి.నరేంద్రవర్మ చేతుల మీదగా షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. వీరికి రూ.20 వేల నగదు, మెడల్, సర్టిఫికెట్ అందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ స్నేహలత, అధ్యాకపకులు విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.

చినగంజాం: మెరిట్ సాధించిన పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న షైనింగ్ స్టార్స్ 2025 పురస్కారాన్ని చినగంజాంకు చెందిన విద్యార్థులు అందుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్లలోని సాయిరాం కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ 2025 పురస్కారాలు అందజేసి కార్యక్రమంలో కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన మాచవరపు సాహితి, బాల జ్ఞానేశ్వరి, సత్యం హైస్కూల్‌లో విద్యనభ్యసించిన నందమూడి సంధ్యారాణి, కొక్కిలగడ్డ జాహ్నవి, గునివిని హరిత, నున్నా రేవంత్, బొలిమెర మేరీ మాధురి,దేవరకొండ మేఘనలు పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.హరనాథ్‌బాబు, హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.రమేష్ బాబు, కల్పన, మేరి, విజయలక్ష్మి, విజయ్‌కుమార్, కోటి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ కార్మికులు

అద్దంకి: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన కార్మికులను తొలగించడం అన్యాయమని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నిరవధిక ఆందోళన నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా అద్దంకి సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా అద్దంకి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యదర్శి తంగరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాలని, ప్రైవేటు యజమానులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని విశాఖ ఉక్కు కార్మిక సంఘాలు 36 నెలలుగా ఆందోళన నిర్వహిస్తున్నప్పటికీ పాలకులకు చీమైనా కుట్టినట్లుగా లేదన్నారు. ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొంతమంది కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం, 5400 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించటం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. విశాఖ ఉక్కు గేటు వద్ద ఉన్న నిరసన దీక్ష శిబిరాన్ని అత్యుత్సాహంతో పోలీసులు ధ్వంసం చేశారని, 50 మంది పైబడి కార్మికులను అరెస్టు చేసిన చర్యకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భీష్మ, ఆదాం, వీరయ్య, నాగేశ్వరరావుతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

భూములు ఖాళీ చేయమనడం అమానుషం



డీటీకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు

బల్లికురవ: బడుగు బలహీన వర్గాలు తమ తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయడం కోసం ఖాళీ చేయమని చెప్పడం అమానుషమని బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసయ్య మాదిగ, పేతూరు మాదిగ అన్నారు. మండలంలోని వల్లాపల్లిలోని పేరంటాళ్లమ్మ తల్లి ఆలయం సమీపంలో ఎస్సీలు సాగు చేసుకుంటున్న భూమిని ఖాళీ చేయమనడంపై సోమవారం బాధితులు ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి డీటీ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రెక్కాడితే కానీ డొక్క నిండని తాము వ్యవసాయం చేసుకుంటూ పశువులను పోషించుకుంటున్నామని, ఆ భూమే లేకుంటే జీవనాన్ని కోల్పోవాల్సి వస్తుందని డీటీకి వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో దుడ్డు వందనం మాదిగ, రమేష్ మాదిగ, లక్ష్మయ్య మాదిగ, సుబ్బారావు మాదిగ ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో మానవహారం

జె.పంగులూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం పంగులూరులో యోగా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేశారు. అనంతరం యోగాతో కలిగే ప్రయోజనాలు తెలిపారు. అనంతరం పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ పి.సింగారావు, ఎంపీడీఓ కె.స్వరూపారాణి, మెడికల్ ఆఫీసర్ (ఆయుష్) కృష్ణకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె.సుమంత్, ఎంఈఓ వీరాంజనేయులు, హౌసింగ్ ఏఈ కిశోర్‌బాబు, ఏపీఎ సంతోషం, పంగులూరు పంచాయితీ కార్యదర్శి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాతి ముఖ మంటప నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాత

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్మిస్తున్న రాతి ముఖ మంటప నిర్మాణానికి విరాళాలు ఇచ్చే దాతల సంఖ్య పెరుగుతోంది. దానిలో భాగంగా సోమవారం జే. పంగులూరు మండలం జనకవరం గ్రామానికి చెందిన తలపనేని సతీస్‌బాబు కుమార్తె కైవల్య రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.1,01,116 అందజేశారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ఈరంకి సూర్యనారాయణమూర్తి ధర్మపత్ని ఉషారాణి స్వామివారి రాతి ముఖ మంటప నిర్మాణానికి రూ.1,00,116 అందజేశారు.

ఒత్తిడి లేని విద్యతో ఉత్తమ ఫలితాలు



క్యాంపెయిన్‌లో పిన్సిపాల్, అధ్యాపకులు

బల్లికురవ: అధ్యాపకుల స్వీయ పర్యవేక్షణలో ఒత్తిడి లేని విద్యను అందిస్తూ రెండున్నర దశాబ్దాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని గుంటుపల్లి, చిన అంబడిపూడి, పెద అంబడిపూడి గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులను కళాశాలలో చేర్చాలని కోరుతూ ఇంటింటా క్యాంపెయిన్ నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ రెండో సంవత్సరంలో నూరు శాతం ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్న విషయాన్ని కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధనతో పాటు డిజిటల్ తగతులు ప్రయోగశాలలు, కంప్యూటర్ విద్యతో ఉదయం సాయంత్రం స్టడీ అవర్లు ఎప్పటికప్పుడు విదాయర్థుల ప్రోగ్రెస్ తల్లిదండ్రులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తరగతులు నిర్వహిస్తున్నామని, అడ్మిషన్ పొంది కళాశాల బలోపేతానికి చేయూత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విన్నవించారు. క్యాంపెయిన్‌లో పి.రవీంద్రబబు, లింగేశ్వరరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ తల్లి సంబరాలు



గ్రామోత్సవంలో గంగమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణతో గంగమ్మ తల్లి

- వైభవంగా గ్రామోత్సవం

వేటపాలెం: స్థానిక పాకనాటి రెడ్డి వీధిలో వేంచేసి ఉన్న భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి గ్రామ దేవత గంగమ్మ తల్లి సంబరాలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి గ్రామోత్సవం తెల్లవార్లూ జరిగింది. గ్రామం చుట్టూ ఊరేగింపు నిర్వహించి సోమవారం అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. డప్పు వాయిద్యాల మధ్య యువకుల ఆనందోత్సాహాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తులు అమ్మ వారికి పొంగళ్ల పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవం



ఛత్రపతికి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ మందిరంతో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జ్యేష్ఠ శుద్ధ తదియ రోజు హిందూ సామ్రాజ్య దినోత్సవంగా నిర్వహించారు. గ్రామ కన్వీనర్ రమణాచార్యులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ మరాఠి యోధుడుగా పట్టాభిషిక్తుడైన రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆనాటి మొగల్ చక్రవర్తుల ఆగడాలు కృత్యాలతో దేశంలో అనేక ఆలయాలు ధ్వంసం చేసినా ఛత్రపతి శివాజీ అనేక యుద్ధాలు చేసి నాసిక్ నుంచి మద్రాస్ వరకు 300 కోటలను నిర్మించి హిందూ సామ్రాజ్య స్థాపన చేసి అనేక ఆలయాలను పరిరక్షణ చేసి ఏకధాటిగా 27 సంవత్సరాలు పరిపాలించారన్నారు. ఆలయ అర్చకులు హర్షవర్ధనాచార్యులు, ఆలయ ధర్మకర్త శీరాం సుబ్బారావు, బ్రహ్మం, మామిడిపాక హరిప్రసాద్, గుంద్రాల రామకృష్ణ, ఎస్ఎస్ ఫ్యాషన్స్ సుబ్బారావు, మెడికల్స్ వెంకటేశ్వరరావు, పాలపర్తి గోపి, పర్చూరు ధర్మ ప్రచారక్ ప్రచార తులసి రాజేష్ పాల్గొన్నారు.

క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చీరాల రూరల్: క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని, తగిన జాగ్రత్తలు పాటించి క్రమం తప్పకుండా వైద్యుల సలహాల మేరకు మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీదేవి సూచించారు. క్షయవ్యాధి 100 రోజుల ముక్తి భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం తోటవారిపాలెం-2, ఆది నారాయణపురం-2 సచివాలయాల్లో చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడారు. క్షయవ్యాధి అంటు వ్యాధి వంటిందని, వ్యాధి ఉన్న వారు దగ్గినా, తుమ్మినా ఆయా తుంపర్లు ఇతరులపై పడితే వారికి కూడా వ్యాధి సోకుతుందని చెప్పారు. ఆకలిగా లేకపోవడం, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం తగ్గకపోవడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యుల సలహాల మేరకు వెంటనే మందులు వాడుకోవాలని సూచించారు. గతంలో టీబీ ఉన్న వారు మందులు వాడి తగ్గిన వారు మళ్లీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది కె.శ్రీలక్ష్మి, ఏఎన్ఎంలు తిరుపతమ్మ, ఎం.ఏసమ్మ, ఏసుమరియమ్మ, పి.శోభారాణి, ఎం.ఎస్తేరురాణి, అర్చన, మధులత, ఎస్. రత్నకుమారి, టి.శ్యామలాకుమారి, వి.కుసుమ, ఎం.రాజ్యలక్ష్మి, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏపై చర్యలు తీసుకోవాలి

చీరాల టౌన్: తన స్థలానికి నకిలీ దస్తావేజులు పుట్టించి వేరే వారికి తాకట్టు పెట్టుకున్న వీఆర్‌ఏపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈపురుపాలేనికి చెందిన షేక్ కరీముల్లా చీరాల తహసీల్దార్ కె.గోపీకృష్ణను వేడుకున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఈపురుపాలేనికి చెందిన షేక్ కరీముల్లా ఆధారాలతో అర్జీ అందించాడు. వివరాలు.. ఈపురుపాలేనికి చెందిన షేక్ కరీముల్లాకు సర్వే నెంబర్ 139-2లో 45 సెంట్లు భూమిని 2015లో కొనుగోలు చేశాడు. ఆ భూమికి సంబంధించి పాస్‌బుక్, ఆన్‌లైన్ అడంగళ్‌లో నమోదు చేసుకున్నాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ సంవత్సరం వ్యవసాయ రుణం కోసం బ్యాంకుకు వెళ్తే తన భూమి రిజిస్టర్ తాకట్టు పెట్టారని, రుణం ఇవ్వమని చెప్పడంతో విస్తుపోయాడు. ఈసీ తీయించగా గ్రామానికి చెందిన వీఆర్‌ఏ షేక్ కరీముల్లా, మరో ముగ్గురితో కుమ్మక్కై తన భూమికి నకిలీ దస్తావేజులు సృష్టించి ఈపురుపాలేనికి చెందిన వీరరాఘవులకు రూ.4 లక్షలకు రిజిస్టర్ తాకట్టు పెట్టడంతో విస్తుపోయిన అసలైన భూ యాజమాని కరీముల్లా తహసీల్దార్‌కు తగిన ఆధారాలతో వినతి పత్రం అందించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించాడు.

అతని ఆగడాలను ప్రశ్నిస్తే చంపుతానని బెదిరిస్తున్నాడని, తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఎస్పీ, కలెక్టర్, ఆర్డీవోకు వినతిపత్రాలు అందిస్తున్నాని బాధితుడు తెలిపాడు.

చేపల అభివృద్ధిపై మత్స్యకారులకు అవగాహన



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చినగంజాం: సముద్రంలో చేపల అభివృద్ధిపై మత్స్యకారులకు మత్స్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధి బాపయ్య నగర్ మత్స్యకార గ్రామంలో బోట్ల యజమానులు, మత్స్యకారులు ప్రస్తుతం చేపల వేట నిషేధం ఉన్నందున వారికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులకు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్వాహణ, పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. పల్లెపాలెం గ్రామ మత్స్య సహాయకులు ఎస్.పుల్లారావు మాట్లాడుతూ బోట్ల, వలలను చేపల వేట చేసిన తర్వాత మంచి నీరుతో శుభ్రపరచు కోవాలని, వాటిని సురక్షిత ల్యాండింగ్ ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని సూచించారు. సముద్ర తీర వెంట పాడైపోయిన వలలు మరియు ప్లాస్టిక్ వస్తువులు వేయరాదని, ప్లాస్టిక్ వస్తువుల ద్వారా సముద్రంలోనే మత్స్యసంపద తగ్గిపోతుందని చెప్పారు. బోట్ల యజమానులు, మత్స్యకారులు, సాగర మిత్రలు పి.తేజస్విని, జి.లావణ్య పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు



పాఠశాలలకు పంపుతున్న స్టూడెంట్ కిట్లు

బల్లికురవ: మండలంలోని 58 పాఠశాలలకు అవసరమైన పాఠ్య పుస్తకాల కిట్లను సోమవారం ఆయా పాఠశాలలకు నేరుగా అందజేసినట్లు ఎంఈవో కె.రమేశ్‌బాబు సోమవారం తెలిపారు. మండల స్టాక్ పాయింట్ నుంచి ఒకటో తరగతి నుంచి పదో తగరతి వరకు చదివే 4,105 మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి విద్యార్థులకు అందజేయాలని ఎంఈవో కోరారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ బి. అంకమ్మరావు, సీఆర్‌పీలు నాగేశ్వరరావు, రంగనాథ్ పాల్గొన్నారు.

కీర్తి వెంకటరాజుకు వెంకటేష్ నివాళి



వెంకటరాజుకు నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కీర్తి వెంకటరాజు దశదిన కర్మ కార్యక్రమం సోమవారం చీరాలలో జరగగా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కీర్తి వెంకట్రావు పాల్గొన్నారు. పట్టణంలోని 13వ వార్డులో నివసిస్తున్న కరణం వారి అభిమాని బొనిగల ప్రకాష్ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శాంతి సమాజ నిర్మాణమే ధ్యేయం

చీరాల అర్బన్: సమాజంలో శాంతి నెలకొల్పడానికి జీవితంలో విలువలు పునరుద్ధరించేందుకు మానవత సంస్థ నిరంతరం కృషి చేస్తోందని వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం చీరాలలోని మానవత సంస్థ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు చీరాల శాఖ అధ్యక్షుడు ఎ.నాగవీరభద్రాచారి అధ్యక్షత వహించారు. ప్రమాద సమయంలో ప్రాణ రక్షణ, నిరంతర రక్తదాన ఏర్పాట్లు చేయడం, ఉచితంగా మార్చురీ ఫ్రీజర్ అందుబాటులో ఉంచడం మానవత సంస్థ ఆశయమని కేంద్ర కమిటీ చైర్మన్ జె.రామాంజనేయ రెడ్డి అన్నారు. చీరాలలో సంస్థ పలు కార్యక్రమాలు సమర్థంగా నిర్వహిస్తున్నారని బాపట్ల మానవత సంస్థ అధ్యక్షుడు హరిప్రసాద్ అభినందించారు. బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ, పి.శివాంజనేయ ప్రసాద్, హరిహరప్రసాద్, కొణికి వీరభద్రకుమార్, గాదె హరిహరరావు, ముప్పల శివప్రసాద్, డిబిఎస్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, కట్టా రాజీవినయ్‌కుమార్, మానవత సభ్యులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబానికి అర్హుల ఎంపిక

యద్దనపూడి: అర్హులైన వారందరినీ బంగారు కుటుంబంగా ఎంపిక చేయనున్నట్లు తహసీల్దార్ కాకి రవికుమార్ అన్నారు. మండలంలోని యద్దనపూడిలో పీ 4 కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పీ4 సర్వే విధానాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.